# సూర్య

www.suryaa.com

## ఆదివారం

6.10.2024


# కోరిన కోర్కెలు తీర్చే కోటదుర్గమ్మ



# చైర్మన్‌తో ముఖాముఖి



నూకారపు సూర్యప్రకాశరావు
చైర్మన్, నేటి దిన పత్రిక సూర్య

**అసిస్టెంట్ కొరియోగ్రాఫర్‌పై అత్యాచారం కేసులో అరెస్టై.. బెయిల్‌పై ఇటీవల విడుదలైన కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్‌కు బిగ్ షాక్ తగిలింది. ఆయనకు ప్రకటించిన నేషనల్ అవార్డును రద్దు చేశారు. పోక్సో చట్టం కింద కేసు నమోదైన నేపథ్యంలో నేషనల్ అవార్డు కమిటీ ఈ నిర్ణయం తీసుకుంది. ఆరోపణలకుముందు వచ్చిన ఈ అవార్డు రద్దు సమంజసమేనా? మీరేమంటారు?**

**–పట్నాన రాజశేఖర్, మచిలీపట్నం**

అవును మీరన్నది నిజమే, జానీ మాస్టారు నేషనల్ అవార్డు ఆయన కష్టార్జితమే అయినా దీనికి ఎంపికైన కొద్ది రోజులకే ఆయనపై అత్యాచారం ఆరోపణలు రావడంతో అరెస్టయ్యారు. అవార్డు అందుకునేందుకు జానీకి కోర్టు ఇటీవల మధ్యంతర బెయిల్ మంజూరు చేసిన విషయం తెలిసిందే. అక్టోబర్ 6 నుంచి 10 వరకు బెయిల్ మంజూరు చేసింది. ఈ సమయంలో మీడియాకు ఇంటర్వ్యూలు ఇవ్వొద్దని, మరో మారు మధ్యంతర బెయిల్ పిటిషన్ దాఖలు చేయకూడదని కోర్టు ఆదేశించింది. జానీ మాస్టర్ కు మధ్యంతర బెయిల్.. నాలుగు రోజులే..!" కాగా, రేపిస్టుకు నేషనల్ అవార్డు ఇవ్వొద్దంటూ పలువురు కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. జానీపై పోక్సో కేసు నమోదైన నేపథ్యంలోనే అవార్డు కమిటీ అతనికి ప్రకటించిన నేషనల్ అవార్డును రద్దు చేసింది. జానీపై పోక్సో కేసు నమోదు కాడంతో.. అవార్డు కమిటీ గౌరవాన్ని కాపాడుకునేందుకు అవార్డును రద్దు చేస్తూ నిర్ణయం తీసుకుంది. ఉత్తమ కొరియోగ్రఫీకి గానూ 2022 జాతీయ చలనచిత్ర అవార్డుకు ఎంపికైన జానీ బాషా.. న్యూఢిల్లీలో జరిగే అవార్డు వేడుకకు హాజరుకావడానికి మధ్యంతర బెయిల్ పొందారు. అక్టోబర్ 8న జానీ అవార్డు అందుకోవాల్సి ఉండగా.. తాజాగా రద్దు చేస్తున్నట్లు ప్రకటన రావడం గమనార్హం. దీంతో అతని బెయిల్ పై అనిశ్చితి ఏర్పడింది. కాగా, జానీ తనపై అత్యాచారానికి పాల్పడ్డాడంటూ ఆయన అసిస్టెంట్ ఇటీవల పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అతడ్ని అరెస్ట్ చేశారు. 2017లో జానీ మాస్టర్ తనకు పరిచయమయ్యాడని, 2019లో అతని టీంలో అసిస్టెంట్ కొరియోగ్రాఫర్‌గా చేరినట్లు బాధితురాలు తెలిపింది. ముంబైలో ఓ సినిమా షూటింగ్ చిత్రీకరణ నిమిత్తం జానీతోపాటు తాను, మరో ఇద్దరు సహాయకులు వెళ్లామని చెప్పింది. అయితే, అక్కడ హోటల్‌లో తనపై జానీ అత్యాచారానికి పాల్పడ్డాడని బాధితురాలు తెలిపింది. "తెలంగాణలో మూడు రోజులు భారీ వర్షాలు, ఈ జిల్లాలకు అలర్ట్" ఈ విషయం ఎవరికైనా చెబితే పని నుంచి తొలగిస్తానని, సినిమా పరిశ్రమలో ఎప్పటికీ పని చేయలేవని తనను జానీ బెదిరించాడని బాధితురాలు వాపోయింది. దీన్ని అవకాశంగా తీసుకుని.. హైదరాబాద్ నుంచి ఇతర నగరాలకు సినిమా షూటింగ్స్‌కు వెళ్లిన సందర్భాల్లో జానీ తనపై పలుమార్లు అత్యాచారానికి పాల్పడ్డాడని బాధితురాలు ఫిర్యాదులో పేర్కొంది. వేధింపులు భరించలేక జానీ మాస్టర్ టీం నుంచి బయట కొచ్చేసినట్లు తెలిపింది. అయినా సొంతంగా పని చేసుకోనివ్వకుండా, ఇతర ప్రాజెక్టులు రానీయకుండా జానీ ఇబ్బంది పెట్టాడని బాధితురాలు ఫిర్యాదులో పేర్కొంది. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. జానీని అరెస్ట్ చేసి కస్టడీకి తరలిం చారు. ఆ తర్వాత అవార్డు కోసం బెయిల్ మంజూరైంది. తాజాగా, ఆ అవార్డు రద్దయింది.


**మకరవిళక్కు సీజన్ ప్రారంభానికి ముందు శబరిమల అయ్యప్ప దర్శనం విషయంలో కేరళ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుందన్నవార్తలు వస్తున్నాయి. అయ్యప్పదర్శనం చేసుకునే భక్తులు సంఖ్యని కుదించాలని నిర్ణయించుకున్నట్టు తెలిసింది. దీనిని కాస్త వివరిస్తారా?**

**–ఎంజ రాజేంద్ర ప్రసాద్, విశాఖపట్నం**

అవును రాజేంద్రగారూ అయ్యప్ప దర్శనం రోజుకు గరిష్ఠంగా 80 వేల మంది భక్తులను మాత్రమే స్వామి దర్శనానికి అనుమతిస్తామని కేరళ ప్రభుత్వం స్పష్టం చేసింది. అయితే శబరిమల అయ్యప్ప దర్శనం కోసం వచ్చే భక్తులు ఆన్‌లైన్ ద్వారా దర్శనానికి బుకింగ్ చేసుకోవాలని..ఓ ప్రకటనతో తెలిపింది. అయితే మకరవిళక్కు సీజన్ మరికొన్ని రోజుల్లో ప్రారం భం కానున్న నేపథ్యంలో.. కేరళ సర్కారు తీసుకున్న ఈ నిర్ణయం అయ్యప్ప భక్తులకు కాస్త ఇబ్బందేనని చెప్పొచ్చు. ఎందుకంటే ఈ సీజన్‌లో అయ్యప్ప దర్శనం కోసం అయ్యప్ప భక్తులు భారీగా శబరికొండకు వస్తుంటారు. ఇప్పుడు ఆన్‌లైన్ ద్వారా ముందే అనుమతి తీసుకోవాలనడం.. అందులోనూ రోజుకు 80 వేల మందికి మాత్రమే దర్శనానికి అనుమతిస్తామని చెప్పటంతో కాస్త ఇబ్బంది తప్పదు. అయితే భక్తుల రద్దీ కారణంగా ఇబ్బందులు తలెత్తకూడదనే ఉద్దేశంతోనే కేరళ సర్కారు ఈ నిర్ణయం తీసుకుంది. అలాగే యాత్రికులు తమ ప్రయాణ మార్గాన్ని కూడా వర్చువల్ క్యూ బుకింగ్ సమయంలో ఎంచుకోవచ్చని కేరళ ముఖ్యమంత్రి కార్యాలయం ఓ ప్రకటనలో తెలిపింది. మరోవైపు మండలం మకర విళక్కు సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి విజయన్ అధ్యక్షతన సమీక్షా సమావేశం నిర్వహించారు. అందులో భాగంగానే వర్చువల్ క్యూ బుకింగ్‌లు రోజుకు 80 వేలకు పరిమితం చేయాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో అటవీ మార్గంలో సౌకర్యాల కల్పన, రద్దీ సమయాల్లో వాహనాల రాకపోకల నిర్వహణ, భక్తులు వచ్చే మార్గంలో కౌంటర్ల ఏర్పాటు, అవసరమైన మౌలిక సదుపాయాలను అభివృద్ధిపై చర్చించారు. అలాగే యాత్రికుల కోసం నీలక్కల్, ఎరుమేలీ బేస్ స్టేషన్ల వద్ద అదనపు పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకున్నారు. రహదారుల మరమ్మత్తులు, పార్కింగ్ ప్రాంతాల నిర్వహణను సీజన్ ప్రారంభం కాకముందే పూర్తిచేయాలని సీఎం పినరయి విజయన్ అధికారులను ఆదేశించారు. ఇక శబరిమలలో పరిశుభ్రత, పారిశుధ్యం పనులు నిర్వహించే విశుద్ధి సేన సభ్యులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని కేరళ సీఎం ఆదేశించారు. సన్నిధానంలోని శబరి గెస్ట్ హౌస్ మరమ్మత్తు పనులు వేగంగా పూర్తిచేయాలని స్పష్టం చేశారు. మరోవైపు గత సీజన్ లో 50 లక్షల మంది భక్తులు శబరిమల అయ్యప్పను దర్శించుకున్నారు. ఇక భక్తుల రద్దీ కారణంగా ట్రాఫిక్ అంతరాయాలు కలిగాయి. ఇక భక్తుల రద్దీకి అనుగుణంగా చర్యలు తీసుకోవటంలో ప్రభుత్వం విఫలమైందంటూ ఆరోపణలు దృష్టిలో పెట్టుకుని రోజుకు 80 వేల మంది భక్తులను మాత్రమేఅనుమతించాలని.. దర్శనం కోసం ఆన్‌లైన్ బుకింగ్ మాత్రమే అనుమతి ఇవ్వాలని నిర్ణయం తీసుకుంది.

# జనం మెచ్చిన తొలితరం సినిమా దర్శకుడు కేవి రెడ్డి

## లెజెండ్



(గతవారం తరువాయి)

వాహినికి మూలా నారాయణస్వామి ఛైర్మన్గా , బి. ఎన్. రెడ్డి మేనేజింగ్ డైరెక్టర్ గా నియమితులయ్యారు. కె.వి.రెడ్డి కూడా వీరితో పాటు వచ్చేసి వాహినీ సంస్థలో ప్రొడక్షన్ విభాగంలోచేరాడు. 1939 నుండి 1942 వరకు ప్రొడక్షన్ మేనేజర్ గా పని చేశాడు.

**భక్తపోతన సినిమా నిర్మాణం :** కె.వి.రెడ్డి తొలి సినిమా భక్త పోతనతో 1943 లో ప్రారంభమైంది.క్యాషియర్‌గా గృహలక్ష్మికి పనిచేసిన నాటి నుంచీ , వాహినీ నిర్మించిన వందేమాతరం (1939), సుమంగళి (1940), దేవత (1941) సినిమాలకు ప్రొడక్షన్ మేనేజరుగా పనిచేయడం వరకు, సినిమా నిర్మాణం పట్ల మెళకువల్ని గ్రహించి ఔపాసన పట్టిన కె.వి.రెడ్డి భక్త పోతన సినిమాకి స్క్రిప్ట్ తయారు చేసుకుని వాహిని బ్యానర్ మీదనే సినిమా నిర్మాణానికి పూనుకున్నాడు. వాహిని సంస్థ నిర్మించిన మొదటి మూడు సినిమాలు పెద్దగా విజయం సాధించలేదు కాబట్టి, కొత్తగా దర్శకుడిగా అవతారం ఎత్తుతూ కె.వి.రెడ్డి నిర్మించే భక్త పోతన సినిమా పట్ల కూడా వాహిని సంస్థ తరుపున ఎవరు ఆసక్తి చూపలేకపోయారు. కొత్త దర్శకుడు అని నిర్లక్ష్యం చేశారు. ఈ సమయంలో మూలా నారాయణ జోక్యం చేసుకుంటూ కె.వి.రెడ్డి సినిమా విజయం సాధిస్తే లాభం సంస్థదని , నష్టం వస్తే వ్యక్తిగతంగా తాను భరిస్తానని తేల్చి చెప్పడంతో సినిమా ప్రారంభం అయింది. సినిమా ప్రారంభం తర్వాత కూడా మొదటి ప్రపంచ యుద్ధం రీత్యా కొన్ని అవాంతరాలు ఏర్పడి నప్పటికీ , సినిమా విజయవంతంగా పూర్తయి సంస్థకు గొప్ప పేరును లాభాలను తెచ్చిపెట్టింది. ఆ విధంగా కె.వి.రెడ్డి సినిమా ప్రస్థానం ఆరంభ మైంది. మొత్తానికి కె.వి.రెడ్డి భక్త పోతన సినిమా విజయం కారణంగా వాహినీ సంస్థ స్థిరపడిపోయింది.

**కేవి రెడ్డి సినీ ఆణిముత్యాలు:** మూడుదశాబ్దాల కాలం 1938 నుండి 1971 వరకు కె.వి.రెడ్డి సినీకళామతల్లికి తన సేవలు అందించారు . వీరు దర్శకత్వం వహించిన మొత్తం సినిమాలు పద్దెనిమిది. వీటిలో తెలుగులో 14 సినిమాలు.అట్లాగే తమిళంలో మూడు సినిమాలు, కన్నడంలో ఒక సినిమా ఉన్నాయి. తెలుగు సినిమాల్లో రెండు చారిత్రకాలు, నాలుగు పౌరాణికాలు, నాలుగు జానపదాలు, నాలుగు సాంఘికాలు, ఉన్నాయి

**చారిత్రకాలు :** భక్త పోతన (1943), యోగివేమన (1947) కె.వి.రెడ్డి తొలి సినిమా భక్తపోతన.

**జానపదం :** గుణసుందరి కథ (1949), పాతాళ భైరవి (1951), జగదేకవీరుని కథ (1961) సత్య హరిశ్చంద్ర (1964),

**సాంఘిక చిత్రాలు :** పెద్దమనుషులు (1954), దొంగ రాముడు (1955)
పెళ్లినాటి ప్రమాణాలు(1958), భాగ్యచక్రం (1968).

**పౌరాణికాలు :** మాయాబజార్ (1957) శ్రీకృష్ణార్జున యుద్ధము (1963), ఉమా చండీ గౌరీ శంకరుల కథ (1968), శ్రీకృష్ణసత్య (1972)

**గుణసుందరి సినిమాలో ఎలుగుబంటి నేపథ్యం:** కె.వి.రెడ్డి తన స్నేహితులతో కలిసి ఒకసారి తాడిపత్రి దగ్గర అడవుల్లో తిరుగుతూ ఉన్న సమయంలో ఒక ఎలుగుబంటి ఆకస్మికంగా వారిపై దాడి చేసింది. కె.వి.రెడ్డి, అతని మిత్రులు దాని మీద తిరగబడుతూ రాళ్ళతో కొడుతూ దాన్ని రెచ్చగొట్టారు. అది కోపంతో విజృంభించింది. పరిస్థితి చేయి దాటి పోవడంతో అందరూ పారిపోయారు. చిన్నవాడైన కె.వి.రెడ్డి భయంతో ఒక దగ్గర నక్కి పోయాడు. పిల్లలంతా పారిపోయారు. ఎలుగుబంటి వెనుతిరిగి వస్తూ కె.వి.రెడ్డిని చూసింది. బాలుడు భయంతో వణికిపోతున్నాడు. ఏడుస్తున్నాడు. ఏమైందో ఏమో ఎలుగుబంటి కొన్ని క్షణాలు కేవీ రెడ్డిని అట్లాగే చూసి, తర్వాత తన దారిన తాను వెళ్ళిపోయింది. ఆ విధంగా కేవీ రెడ్డి ప్రాణాలు దక్కాయి. అంతవరకు కోపంతో బుసలు కొట్టిన ఎలుగుబంటి కె.వి.రెడ్డిపై దాడి చేయకపోవడం నిజంగా విచిత్రం. తన జీవితంలో జరిగిన ఈ సంఘటన ఆధారంగా " జంతువులకు కూడా జాలి, దయ వంటి సుగుణాలు ఉంటాయి " అని తెలియజేస్తూ గుణసుందరి కథ సినిమాలో ఎలుగుబంటి పాత్ర రూపకల్పన చేయడం జరిగింది...

**జీవితాల్ని నిలబెట్టిన కేవి రెడ్డి:** ఎన్.టి.రామారావు, ఎస్.వి.రంగారావు, అల్లు రామలింగయ్య వంటి నటుల సినిమా భవితన్యం కె.వి.రెడ్డి సినిమాల కారణంగా నిలదొక్కుకుంది. పింగళి నాగేంద్రరావు, డి.వి.నరసరాజు, కొసరాజు రాఘవయ్య వంటి రచయితల సినిమా భవిష్యత్తు స్థిరపడడానికి కూడా కె.వి.రెడ్డి సినిమాలే కారణం.

**ఎన్టీఆర్ ను కృష్ణుడిగా నిలబెట్టిన కె.వి.రెడ్డి :**

కె.వి.రెడ్డి గారి మాయాబజార్ సినిమాలో ఎన్టీ రామారావు కృష్ణుడిగా నటించి, కృష్ణుడు అనే రూపానికి ఒక నమూనాగా గుర్తింపబడ్డాడు.

(మిగతా వచ్చేవారం)

## నవ కవిత్వం

### నీ కథ నా కథ అర్ధాంతరం



ఎన్నో అందమైన సాయంత్రాలు
ఎన్నో హృదయాన్ని తొలిచే
జ్ఞాపకాలు
మరలిరానిజి
మరపురానిజి
జీవితపు అమృత ఘడియలు

ఆనాడు జీవితం వెలుగుతో
నిండిపోయింది
ప్రపంచం ఒక స్వర్గసీమను
తలపించింది
రంగు రంగుల కలల ప్రపంచం
కేవలం నీవు నేను యజమానులం
నీ పరిమళం నా చుట్టూ
పరచుకుంది

ఈనాడు జీవితం
చీకటి ఛాయలో
అంధకారపు లోయలో
భూమి నుంచి ఆకాశం వరకు
పరచుకున్న
అంతు చిక్కని ఒంటరితనపు
వేదనలో
అసంపూర్తి చివరి మజిలీలో
కాలమనే ఇసుకపై నీవు ఏదో
రచించావు
కళ్లు తెరచి చూస్తే అంతలోమాయ-
ంమైపోయావు
నా స్వప్న సౌధం కూలిపోయింది
నేను ఏకాకిగా మిగిలిపోయాను
నేను అగాధంలో చిక్కుకున్నాను
నేను మనిషిని
ఎలా చెప్పను దుఃఖానికి
భయపడనని
ఇక నావ చేరేది ఏతీరం
ఇక నా కథ  నీ కథ అర్ధాంతరం

**అరుణ డేనియల్**
**9000606889**

## లేఖలు

**ముఖచిత్ర కథనం** మన పాఠాలలో బోధనకు సాంకేతికతను జోడించాల్సిన అవసరంపై మన సూర్య ఆదివారం అనుబంధంలో ప్రచురించిన కథనం అద్భుతం అనే చెప్పాలి. ఈ తరహా వ్యాసాలు మన సమాజంలో చైతన్యాన్ని నింపుతుందనటంలో సందేహంలేదు. విపులనాత్మక వ్యాసం అందించిన రచయి-ంతకు సంపాదకీయ వర్గానికి ధన్యవాదములు  అన్ని పత్రికలకు విభిన్నంగా భిన్న అంశాలను ముఖపత్ర కథనాలుగా ప్రచురిస్తున్న మీకు, సంపాదక వర్గానికి, యాజమాన్యానికి ధన్యవాదాలు. ఈ తరహా మరిన్ని కథనాలు ప్రచురించాలని కోరుతున్నాము.  సందర్భాను సారంగా మన పత్రికలో ప్రత్యేక వ్యాసా లు రాయించి ప్రచురిస్తున్న మీకు, సంపాదక వర్గానికి కృతజ్ఒతలు. తెలుగు భాషపైనా ఓ ప్రత్యేక కాలమ్ నిర్వహిస్తే బాగుం టుంది. భాషను మర చిపోయి బావ దారిద్రంలో ఉన్న వారికి ఉపయోగ పడుతుందని నా మనవి.

**– వారాంతపు రజనీ, వరంగల్**
**–బి మధుశేఖర్, హైదరాబాద్**




**సినిమా రివ్యూలు బాగున్నాయ్**

వారం వారం విడుదలవుతున్న చిత్రాలలో మంచి చెడ్డలను, నటీ నటులు, సాంకేతిక నిపుఫణుల పనితీరును అర్ధవంతంగా వివరి స్తున్న విశ్లేషకులకు ధన్యావాదా లు. ప్రధానంగా ధియేటర్లలోకి రాకుండా ఓటిటికే పరిమితమవు తున్న సినిమా లపైనా విశ్లేషణలే చేస్తుండటం హర్షించదగ్గది.

**– ముక్కామలపద్మావతి, హైదరాబాద్**

**కథలు బాగున్నాయి**

వారం వారం ప్రచురిస్తున్న కథలు బాగున్నాయి కొత్త రచయితలకు మీరం దిస్తున్న ప్రోత్సాహం బాగుం ది. . రచిత కథనాన్ని బాగా నడిపిస్తున్నారు. మంచి రచ నలు అందిస్తున్న మీకు ధన్యవా దాలు

**–శ్రీవల్లి తన్మయ్, హైదరాబాద్,**

## చిగురిస్తున్న మోడునవుతాను




ఈ ఎర్ర మట్టిలో నేను
మానవత్వమై మొలకెత్తాల్సిన వాని
చైతన్యమై పరిమళించల్సినవాని

కానీ
సెల్ ఫోన్లకు కళ్ళను కట్టేసి
సీరియల్ల్న ప్రవాహంలో
కొట్టుకుపోతున్న
సినిమాల అసంబద్ధ సిద్ధాంతాలకు
ఆగమై అడవి పాలవుతున్న

ద్రవ్యోల్బణం వల్ల దరిద్రుని కాకుండా
నాన్న గడ్డి కరుస్తూ కాలం
గడుపుతున్న
నిజాయితీ నిబద్ధతలను నీళ్లపాలుజేసి
నిలువెత్తు అబద్ధంలా తిరుగుతున్న


సుడిగుండాలా చుట్టేస్తున్న
సమస్యలలో
సుడిపడి తిరుగుతున్న నన్ను
కాసింత కనికరమున్న
మనుషులా మారడానికి
నిటారుగా  నిలబడడానికి
రవ్వంత ధైర్యం నూరిపోయాలి
మళ్లీ
చిగురిస్తున్న మోడునవుతాను నేను

**డా.ఎడ్ల కల్లేశ్**
**9866765126**




సూర్య బుడత

బాలల కథ




# నైతిక విజయం


గోమతి రాజ్యాన్ని విక్రమార్కుడు పరి పాలించేవాడు.ప్రజలకు ఏం కష్టం రానీయకుండా జనరంజకంగా పాలిస్తూ అందరి మన్ననలను పొందే వాడు.తన రాజ్యం సుభిక్షంగా ఉండాలని ఎప్పటి కప్పుడు అన్ని శాఖల తో సమావేశమై ప్రజల కష్టాలను తెలుసుకుంటూ సమస్యలను పరిష్కరించేవాడు.ఒకోసారి మారు వేషంలో ప్రజలలోకి వెళ్ళి వారి ఇబ్బం దులను ప్రత్యక్షంగా తెలుసుకుని మంత్రి ద్వారా తీర్చేవాడు. ప్రజలందరూ విక్రమార్కుని పరిపాలనలో ఆనందంగా జీవించేవారు. విక్రమార్కునికి తన ప్రజల శ్రేయస్సే ముఖ్యం. ఇతర రాజ్యాలపై యుద్ధం చేసి ఆక్రమించాలనే ఆలోచన ఉండేది కాదు.అలాగని తన రాజ్యం పై ఎవరైనా యుద్ధానికొస్తే ధైర్యంగా ఎదు ర్కొని తరిమేవాడు.ఏ నాడు యుద్ధంలో ఓటమి చవిచూడలేదు.చుట్టూ ఉన్న రాజ్యాల రాజులు విక్రమార్కుడుతో గెలవలేమని గోమతి రాజ్యంపై కన్నెత్తి చూసేవారు కాదు.ఒక రోజు గోమతి రాజ్యంలో సగం మంది ప్రజలకి, సైని కులకి ఓ వింత వ్యాధి సోకింది.విక్రమా ర్కుడు ఆందోళన చెందాడు.వెంటనే తన రాజ్యం లోని వైద్యులకి ఆ వింత వ్యాధిని నయం చేయమని ఆదేశిం చాడు.ఎంత వ్యయమైనా నయం చేయమని చెప్పాడు.వైద్యులు ఆ వింత వ్యాధి నయం చేసే పనులో తలమునక లయ్యారు.ఇంతలో గోమతి రాజ్యాన్ని ఎలాగైనా ఆక్రమించాని గతంలో ఐదు సార్లు విక్రమార్కుని చేతిలో ఓడిపోయినపొరుగు శాకుంతల రాజ్యం రాజు దేవ సేనుడు ఈ సారి ఎలాగైనా గెలవాలని కంకణం కట్టుకుని, యద్దానికి వస్తున్నట్టు తన వేగుల ద్వారా విక్రమార్కునికి వర్త మానం పంపాడు. తన రాజ్యం లో సగం మంది ప్రజలకి, సైనికులకి వింత వ్యాధి సోకిన తరుణంలో యుద్ధం ఎలా వెళ్లాలని ఆలోచనలో పడ్డాడు విక్రమార్కుడు.తన ప్రజలకి వైద్యం చేయిస్తూ,తన రాజ్యాన్ని కాపాడుకోవడమే తన ముందున్న కర్తవ్యం.




యుద్ధానికి తగిన సంఖ్యా బలం లేకపోయినా గెలవకపోతే తన ప్రజలు వారికి బానిసలుగా బ్రతకాలని మొక్క వోని ధైర్యంతో యుద్ధానికి మిగి లిన సైన్యాన్ని సన్నద్ధం చేసాడు విక్రమార్కుడు. విక్రమార్కునికి, దేవ సేనుడికి మద్య భీకర యుద్ధం జరిగింది.తగిన సంఖ్యా బలం లేకపోవ డంతో దేవసేనుడి చేతిలో విక్రమార్కుడు మొదటి సారిగా ఓడిపోయాడు. దేవసేనుడి ఆనందానికి హద్దులు లేవు.ఎప్పుడు ఓడని విక్రమార్కుడు ఈ సారి ఎందుకు ఓడాడని దేవసేనుడికి సందేహం కలిగింది.వెంటనే వేగుల ద్వారా కారణం తెలుసుకోమని ఆదేశించాడు దేవసేనుడు. ఓటమికి గలకారణం తెలుసుకున్న వేగులు చెప్పిన మాటలు విని దేవసేనుడు ఆశ్చర్యపోయాడు.తను రాజ్యాన్ని ఆక్రమించా లనే కాంక్షతో ఇన్నాళ్లు ఆలోచించానే కాని ఏ రోజు ప్రజల శ్రేయస్సును కోర లేదని, విక్రమార్కుడు ప్రజల శ్రేయస్సు చూస్తూ కూడా యుద్ధం లో వీరోచితంగా పోరాడని గ్రహించాడు.వెంటనే విక్రమార్కుడిని కలిసి"విక్రమార్కా! యుద్ధం చేయడమంటే శత్రు రాజులను ఓడించటమే కాదు.ప్రజల శ్రేయ-స్సును కూడా చూడాలని నీవు నిరూపించావు.తగిన సంఖ్యా బలం లేకున్నా, ప్రజలు, సైనికులు వింత వ్యాధితో బాధపడు తున్నా వారికి వైద్యం చేయస్తూనే నాతో యుద్ధానికి తలపడ్డావు.నిజమైన వీరు డివి నీవే.ఈ యుద్ధంలో నీవు ఓడిపోయినా నైతిక విజయం నీదే. కనుక నీ రాజ్యాన్ని నీకేఇచ్చేస్తున్నాను.ఇంకెప్పుడు ఏ రాజ్యం పై యుద్ధం చేయను. నా రాజ్యంలో ప్రజలను సుభిక్షితంగా చూసుకుంటాను"అని చెప్పి గోమతిరాజ్యాన్ని విక్రమార్కుడికి అప్పగించి వెనుతిరిగి వెళ్ళిపోయాడు. ఈ విషయం తెలుసుకున్న పొరుగు రాజ్యాల రాజులు రాజు అంటే యుద్ధం చేసేవాడే కాదు తన రాజ్యంలో ప్రజల శ్రేయ-స్సును కోరే వాడిని తెలుసుకుని యుద్ధాలు చేయడం మానుకుని తమ ప్రజల శ్రేయస్సు కోసం పరిపాలన చేయసాగారు.

**కయ్యూరు బాలసుబ్రమణ్యం**
**9441791239**










# మన జీవితాలకు ఉషాకిరణాలు-ఉపాధ్యాయులు

దేవుడు, గురువు ఇద్దరూ ఒకేసారి ఎదురుపడితే నేను మొదటగా గురువుకే నమస్కరిస్తాను అంటారు ఓ ప్రఖ్యాత హిందీ కవి.మన జీవితాల్లో అజ్ఞానపు చీకట్లను పారద్రోలి జ్ఞాన వెలుగులను ప్రసరించేలా చేసేవారు ఉపాధ్యాయులు.కేవలం విద్యాసంస్థల్లో విజ్ఞానపు పాఠాలు బోధించే వారు మాత్రమే కాదు గురువులంటే.మన జీవితాల్లో అక్షరం ద్వారా గానీ,తమ ఆలోచనల ద్వారా గానీ,తమ అనుభవపు అభిప్రాయాల ద్వారా గానీ,ఇంకా ఏరూపంలో అయినా సరే మార్పు తీసుకొచ్చి స్ఫూర్తి ప్రదాతలుగా మన పురోభివృద్ధికి బాటలు వేసిన వారందరూ మనకు ఉపాధ్యాయులే.చరిత్రను మనం గమనిస్తే ఒకప్పటి సాధారణ వ్యక్తులు విఖ్యాత ప్రముఖులుగా రూపాంతరం చెందడంలో కొన్ని పుస్తకాలు కూడా మార్గదర్శనం చేశాయి.అలాంటి పుస్తకాలు కూడా మనకు జీవిత పాఠాలు బోధించే గురువులే.కృష్ణుడి భగవద్గీత,గౌతమ బుద్ధుని బోధనలు, బైబిల్ , ఖురాన్ వంటి ఆధ్యాత్మిక గ్రంధాలు సైతం మనకు దారి చూపే దీపాలే.సరిహద్దుల్లో వుండే మనదేశ సైనికులు శత్రువుల నుండి మనల్ని కాపాడితే సరిహద్దు లోపల ఈ దేశాన్ని అంతర్గత శత్రువుల నుండి కాపాడి అభివృద్ధి భారతంగా నిర్మించడంలో కీలకపాత్ర పోషించే అక్షర సైనికులే ఉపా ధ్యాయులు."ఓ ఇంజనీర్ బిల్డింగ్ ప్లాన్ తప్పుచేస్తే భవనాలు కూలి పోతాయి.ఓ డాక్టర్ వైద్యం సరిగ్గా చేయకపోతే కొన్ని ప్రాణాలు గాల్లో కలిసిపోతాయి.ఓ అధికారి అవినీతి చేస్తే సమాజపు మనుగడలో ఇబ్బం దులు తలెత్తు తాయి.కానీ ఓ ఉపాధ్యాయుడు కేవలం స్వార్థపూరితంగా తమజీతం కోసం మాత్రమే ఆలోచిస్తూ, భావితరాల భవిష్యత్తు గురించి సరిగ్గా పనిచేయకపోతే కొన్ని తరాలే నాశనం అవుతాయి" వంటి సూక్తులు నేడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

ప్రతి సంవత్సరం సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సెప్టెంబర్ 5 న ఆయన గౌరవార్ధం మరియు కోరిక మేరకు మనమంతా జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహిస్తున్నాము.ఈ సందర్భంగా కొన్ని ప్రత్యేక కార్యక్రమాలతో పాటు ఉపాధ్యాయులను సన్మానించుకుంటాం.ఈ దేశ తొలి ఉపరాష్ట్రపతిగా పది సంవత్సరాలు, రెండవ రాష్ట్రపతిగా ఐదు సంవత్సరాలు విశిష్ట సేవలందించిన భారతరత్న రాధాకృష్ణన్. వివేకానంద మరియు రవీంద్రనాథ్ ఠాగూర్ వంటి మహానుభావుల స్ఫూర్తితో భారతదేశ విద్యా వ్యవస్థపై తనదైన శైలిలో చెదరని ముద్ర వేసిన రాధాకృష్ణన్ ఉపాధ్యాయుడిగా, అధ్యాపకుడిగా,ప్రొఫెసర్ గా, ఆంధ్రా యూనివర్సిటీ మరియు బనారస్ యూనివర్సిటీ ఉపకులపతిగా,ప్రపంచం గుర్తించిన గొప్ప తత్వవేత్తగా ఆయన జీవన ప్రయాణం కొన్ని తరాలకు స్ఫూర్తిదాయకం.హిందూమతంలోని గొప్పతనాన్ని, ప్రాముఖ్యతను ప్రపంచానికి అవగాహన కల్పించడంలో ఆయన తన అద్వితీయమైన రచనలతో,ఆలోచనలతో "ది ఇండియన్ ఫిలాసఫీ"ని అందించారు.సాహిత్యంలో నోబెల్ బహుమతికి నామినేట్ అయినప్పటికీ



కొన్ని కారణాల వల్ల బహుమతిని గెలవలేక పోయారు. విజ్ఞానం ఆధారంగా మాత్రమే ఆనందం మరియు సంతోషకరమైన జీవితం సాధ్యమవుతుందంటారు రాధాకృష్ణన్.

తన అద్భుతమైన వాగ్ధాటితో చికాగోలోని ప్రపంచ సర్వమత సమ్మేళనంలో భారతీయ ఆధ్యాత్మిక సంస్కృతిని ప్రపంచానికి చాటిచెప్పిన వివేకానందుడు వంటి వారి జీవితంలో తన గురువు రామకృష్ణ పరమహంస ప్రేరణ, మార్గదర్శనం ప్రముఖంగా కన్పిస్తుంది.ఆయన వల్లే వివేకానంద రామకృష్ణ మిషన్ స్థాపించారు.ఆ మిషన్ సాయంతో నేటికి ఎన్నో విద్యాసంస్థల ద్వారా పేదలకు సైతం నాణ్యత గల విద్యను అందిస్తున్నారు.రామకృష్ణ మరియు వివేకానంద గురుశిష్య సంబంధం చరిత్రలో సువర్ణాక్షర లిఖితం.అస్పృశ్యత, అంటరానితనం వంటి మహామ్మారులను దాటి తన మేధస్సుతో యావత్ ప్రపంచానికి విద్యగొపృతనం చాటిచెప్పిన భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ తన జీవితాన్ని తీర్చిదిద్దిన గురువుకు చరిత్రలో ప్రత్యేక స్థానం ఇచ్చారు.మన స్వాతంత్ర్య సంగ్రామంలో కీలకమైన వ్యక్తిగా చరిత్ర కెక్కిన భారతరత్న సుభాష్ చంద్రబోస్ వివేకానందను తన గురువుగా చెప్పుకున్నారు.నేతాజీ వివేకానంద దేశభక్తి బోధనల ఆచరణతోనే నేటికీ యావత్ భారత జాతికి రియల్ హీరో అయ్యారు.విశ్వమానవుడుగా,ఈ శతాబ్దపు అత్యున్నత వ్యక్తుల్లో ప్రముఖునిగా గుర్తించబడ్డ గాంధీజీ కూడా టాల్ స్టాయ్ రచనలతో,ఆలోచనలతో సత్యం మరియు అహింసలకు ఆకర్షితుడయ్యాడు.రవీంద్రనాథ్ ఠాగూర్ విశ్వ భారతి విశ్వ విద్యాలయం, శాంతినికేతన్,ప్రకృతి విద్య వంటివి నేటి ఆధునిక భారతదేశపు విద్యావిధానంలో కూడా దిక్సూచిగా వున్నాయి.విభిన్నరంగాల్లో నోబెల్ బహుమతులు గెలిచిన విఖ్యాత ప్రముఖులు, ఒలింపిక్స్ విజేతలు సైతం తమ విజయంలో తాము గురువులుగా భావించే వ్యక్తులకు భాగస్వామ్యం కల్పించారు.చిన్నప్పుడు మా ఉపాధ్యాయుల బోధన,వారి ఉన్నత వ్యక్తిత్వం వల్లనే పెద్ద పెద్ద రాకెట్ కలలు కనడం ఆరంభించి రామేశ్వరం నుంచి రాష్ట్రపతి భవన్ దాకా తన ప్రయాణం కొనసాగిందని, ఉపాధ్యాయ వృత్తి అన్నింటిలో కెల్లా అత్యున్నతమైనదంటారు భారతరత్న అబ్దుల్ కలామ్.క్రికెట్ లో భారత్ ను విశ్వ విజేతగా నిలపాలనే సంకల్పంతో ఎన్నో అవాంతరాలను అధిగమించి సుదీర్ఘ క్రీడా ప్రస్థానంలో భారత్ కు వరల్డ్ కప్ అందించిన సచిన్ తన వీడ్కోలు ప్రసంగంలో తన చిన్ననాటి క్రికెట్ కోచ్ అచ్రేకర్ గురించి ప్రత్యేకంగా ప్రస్తావించారు.భారతదేశం గర్వించదగ్గ సినీహీరోలు రజనీకాంత్, కమల్ హాసన్ లు నేటి తమ స్థాయికి డైరెక్టర్ బాలచందరే కారణమని సవినయంగా ఎన్నో వేదికల ద్వారా ప్రకటించారు.

పారిస్ లో యునెస్కో ఆధ్వర్యంలో ఐరాస, అంతర్జాతీయ కార్మిక సంస్థ వంటి అంతర్జాతీయ ప్రముఖ సంస్థలు కలిసి ప్రపంచ వ్యాప్తంగా ఉపాధ్యాయుల హక్కులు,హోదాలు, బాధ్యతలు వంటి తదితర అంశాలతో కొన్ని నిర్దిష్ట సిఫారసులతో కూడిన సమగ్రమైన పత్రం "స్టేటస్ ఆఫ్ ది టీచర్స్" పేరుతో రూపొందించారు.ఈ సందర్భంగా అక్టోబర్ 5ను అంతర్జాతీయ ఉపాధ్యాయుల దినోత్సవంగా నిర్వహిస్తున్నారు. మనం దేశంలో ప్రభుత్వ విద్యాసంస్థల్లో, విశ్వ విద్యాలయాల్లో పనిచేస్తున్న బోధన మరియు బోధనేతర సిబ్బంది హక్కుల కోసం ఎన్నో సంస్థలు ప్రభుత్వాలతో చర్చిస్తున్నాయి.ప్రభుత్వాలు కూడా కొంత మేరకైనా ప్రభుత్వ విద్యా సంస్థల సిబ్బంది సమస్యలను పరిష్కరిస్తున్నాయి.కానీ ప్రయివేటు విద్యాసంస్థల్లో పనిచేస్తున్న సిబ్బంది గురించి పెద్దగా ఏ ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదు.ఓటు బ్యాంకు రాజకీయాల మధ్య ప్రయివేటు విద్యాసంస్థల సిబ్బంది మధ్య ఐక్యత లేని కారణంగా, అందరికీ సమాన వేతనాలు అందక పోవడం వల్ల ప్రయి-వేటు విద్యాసంస్థల్లో పనిచేస్తున్న సిబ్బంది బ్రతుకులు ఉద్యోగ, ఆరోగ్య, ఆర్థిక భద్రతలు లేక నిత్యం జీవన పోరాటంలో ఎన్నో సమస్యలను ఎదుర్కొంటున్నారు.లక్షల సంఖ్యలో వున్న ప్రయివేటు విద్యాసంస్థల్లో సిబ్బంది గురించి కూడా కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాలు ఆలోచించి వారికి కనీసం కొన్ని ప్రత్యేక ప్రభుత్వ పథకాలను ప్రవేశపెట్టాలి.రెండవ ఎక్కం అందరికీ ఒకే విధంగా వున్నప్పుడు అది బోధించే ఉపాధ్యాయుల బ్రతుకుల్లో ప్రభుత్వం, ప్రయివేటు అంటూ జీతాల వ్యత్యాసాలు ఎందుకున్నాయి.సమాజంలో గౌరవం,హోదాలో తేడాలు ఎందుకు కనిపిస్తున్నాయి.ప్రస్తుతం సమాజం మరియు ప్రభుత్వాలు ప్రయివేటు విద్యాసంస్థల్లో పనిచేస్తున్న సిబ్బందిని చూసే దృక్పథం, దృక్కోణం మారి ఉపాధ్యాయులందర్ని సమదృష్టి తోనే చూడాలి.విద్య ఎప్పటికీ వ్యాపారం కాదు.విద్య అనేది కూడా ఓ వ్యవసాయమే.రైతు ఆకలిని తీరుస్తాడు.గురువు అజ్ఞానాన్ని తరిమేస్తాడు.

A good teacher can inspire hope,ignite the imagination,and instill a love of learning

**ఫిజిక్స్ అరుణ్ కుమార్**
**9394749536**

# టాబ్లెట్స్‌కి జబ్బు ఎక్కడుందో ఎలా తెలుస్తుంది?

ఆనారోగ్య సమస్యతో వేసుకునే మందులో ఉండే రసాయనాలు కొన్ని రకాల రిసెప్టర్లకు మాత్రమే అతుక్కునేలా తయారు చేస్తారు. రిసెప్టర్ కేవలం దానికి సరిపోయే రసాయనాన్ని గ్రహిస్తుంది. శరీరం అంతటా మందు అన్ని భాగాల్లోకి ప్రవహించినా సమస్య దగ్గర దాని ప్రభావం చూపిస్తుందట. నోటి ద్వారా వేసుకున్న మాత్రకు మన శరీరంలో ఎక్కడ సమస్య ఉందో ఎలా తెలుస్తుంది..? అనే డౌట్ అందరికీ వస్తుంటుంది. మనం వేసుకున్న ట్యాబ్లెట్‌కు ఏ పార్ట్ దగ్గరికి వెళ్లి పనిచేయాలో ఎలా తెలుస్తుంది. దీనిపై రకరకాల కామెడీ జవాబులు చెబుతున్నారు నెటిజన్లు. ట్యాబ్లెట్ చెవిలో మంత్రం చెప్పి పంపిస్తారని ఒకరు కామెంట్ చేస్తే, లోపలికి వెళ్లాక ట్యాబ్లెట్ గూగుల్ మ్యాప్స్ ఆన్ చేసుకుంటుందని ఇంకొకరు సరదాగా కామెంట్లు పెడుతున్నారు. నిజంగా మనం వేసుకునే టాబ్లెట్స్ శరీరంలోకి వెళ్లాక ఎలా పనిచేస్తాయో ఈ ఆర్టికల్‌లో తెలుసుకుందాం.

**ట్యాబ్లెట్ ఇలా పనిచేస్తుంది:** ఆనారోగ్య సమస్యకు ఇచ్చిన మాత్రలు, మందులు, టానిక్.. నోటి ద్వారానే శరీరం లోపలికి చేరతాయి.



ఆహారం తీసుకుంటే అదెలా ప్రయాణిస్తుందో మందు కూడా అదేవిధంగా జీర్ణాశయంలోకి చేరుకుంటుంది. అక్కడ విచ్ఛిన్నమై జీర్ణమైన మందులు రక్తంలో కలుస్తాయి. ఈ రక్తం చిన్న ప్రేగుల నుంచి హెపాటిక్ పోర్టల్ వెయిన్ అనే నాళం ద్వారా కాలేయానికి చేరుతుంది.

కాలేయంలో శుద్ధి చేసిన రక్తమే శరీరంలోని అన్ని భాగాలకు సరఫరా అవుతుంది.

కాలేయంలో ఈ ట్యాబ్లెట్ తాలూకు సమ్మేళనాలు కూడా మరింత విచ్ఛిన్నం అవుతాయి. అవి మళ్లీ రక్త ప్రసరణలోకి చేరతాయి. ఇలా మందులు ఉన్న రక్తమే శరీరంలోని అన్ని భాగాలకూ, కణజాలాలకు ప్రవహిస్తుంది. దాంతో మందు కూడా ప్రతి భాగానికి చేరుకుంటుంది. అయితే వెళ్లిన ప్రతిచోటా ఈ మందు ప్రభావం చూపదు.

**సమస్య ఉన్నచోటే ఎలా పనిచేస్తుంది..?**

మన శరీరంలో ప్రొటీన్ అణువులుంటాయి. ఇవి కణాల ఉపరితలం మీద, కణాల లోపల కూడా రకరకాల ఆకారాల్లో విభిన్నంగా ఉంటాయి. మనం వేసుకున్న మందును గ్రహించేది ఇవే. మందులో ఉండే రసాయనాలు కొన్ని రకాల రిసెప్టర్లకు మాత్రమే అతుక్కునేలా తయారు చేస్తారు. అంటే రిసెప్టర్ కేవలం దానికి సరిపోయే రసాయనాన్ని మాత్రమే గ్రహిస్తుంది. శరీరం అంతటా మందు అన్ని భాగాల్లోకి ప్రవహించినా కూడా సమస్యకు సంబంధించిన గ్రాహకాలు ఎక్కడుంటే అక్కడ ఎక్కువగా పనిచేస్తుంది. దాని ప్రభావం చూపిస్తుందని నిపుణులు చెబుతున్నారు.

## ఈ వారం కథ

# స్పాట్

“ఏవండోయ్ మీకు ఆర్డర్ వచ్చిందా?”
“ ఈ సారి నాకు వద్దు అన్నాను లెండి”
“ నాకు ఆర్డర్ వచ్చిందండోయ్”
వామన రావు ఆత్రుతగా చెప్పాడు
సుబ్బారావుతో.
“ ఏమిటి సార్ అంత ఆనందంగా ఉన్నారంటూ” నిరంజన్ రావు అప్పుడే స్టాఫ్ రూమ్ లోకి అడుగుపెట్టాడు.
“ వామన రావుకు అపాయింట్మెంట్ ఆర్డర్ వచ్చింది లెండి” నిరంజన్ తో సుబ్బారావు చెప్పాడు.
అపాయింట్మెంట్ ఆర్డర్ అందుకున్న వామన రావు గాల్లో తేలిపోతున్నాడు.
నిరంజన్ రావు వామన రావుకు ‘కంగ్రాట్స్ ‘చెప్పాడు.
పిల్లలకు పాఠాలు చెప్పడమే కానీ పేపర్లు దిద్దే అవకాశం వామన రావుకు ఇంతవరకు రానే రాలేదు.
వామన రావుకు ఇదే తొలిసారి కావటంతో భాగ్యలక్ష్మి బంపర్ లాటరీ తగిలినంత ఆనందంగా ఉంది.
డిపార్ట్మెంట్ లోని కొలీగ్స్ కు స్వీట్స్ తెప్పించి పంపిణీ చేశాడు.
ఇంట్లోకి అడుగు పెడుతూనే “ఏమోయ్ రెండేసి జతలు బట్టలు, లుంగీలు, టవల్స్, బ్రష్,టూత్ పేస్టు, సబ్బు అన్ని నా జర్నీ బ్యాగ్ లో సర్దె సేయ్ “.
“అర్జెంటుగా ఎక్కడకి ప్రయాణం శ్రీవారు....!”
“నాకు పేపర్ దిద్దే అవకాశం ఇన్నాళ్లకు కలిగిందోయ్. నాకు వచ్చే రెమ్యూన్ రేషన్ తో నీకో కానుక ఇ స్తాను సరేనా” అన్నాడు.
“అబ్బబ్బ మా శ్రీవారు బంగారు కొండ. ఎంత శుభవార్త చెప్పారు.బెస్ట్ ఆఫ్ లక్. ఉండండి వేడివేడి లు పట్టుకొస్తాను “అంటూ కిచెన్ లోకి వెళ్ళింది.
డ్రెస్ చేంజ్ చేసుకుని రావటానికి బాత్రూం లోకి దూరాడువామన రావు.ముఖం,కాళ్లు,చేతులు కడుక్కుని ఫ్రెషప్ అయ్యి హాల్లోకి వచ్చి టీవీ ఆన్ చేసాడు.
భార్యమణి వచ్చి వేడి వేడి పకోడీల ప్లేట్ భర్త చేతిలో పెట్టింది. “అయ్యవారు! లాగించండి.టీ పట్టుకొస్తాను”.
“ చిత్తం దేవి! ఇది దేవి ప్రసాదం...!”.
పకోడీలు తింటూ టీవీలో తనకిష్టమైన నేషనల్ జాగ్రఫీ ఛానల్ చూస్తున్నాడు.టీ తెచ్చిచ్చి వంట పనుల్లో నిమగ్న మైపోయింది.
వంట అయ్యాక భర్తకు వడ్డించి తాను కూడా భోజనం చేసింది. వంటింట్లో అన్ని సర్దుకుని పడక గదిలోకి వచ్చే సరికి భర్త మంచం మీద అటు ఇటు దొర్లుతున్నాడు. చాలాసేపు నిద్ర పట్టలేదు వామన రావుకి. భార్య సుఖంగా గాఢ నిద్రపోతుంది.

ఎప్పుడు తెల్లవారుతుందా అనే ఆత్రుతతో మగత నిద్రలోకి జారుకున్నాడు వామన్ రావు.
ప్రతిరోజు ఆలస్యంగా భార్య లేపితే గాని లేవని వామన రావు.ఈరోజు తొందరగా లేపకుండానే లేచాడు. కాలకృత్యాలు తీర్చుకుని బ్రెష్ చే సుకున్నాడు. అల్పాహారం తిన్నాడు. భార్యకు టాటా చెప్పి సూట్ కేస్ తో బయలుదేరాడు.
“స్పాట్ సెంటర్ కి సకాలంలోనే చేరుకున్నాడు వామనరావు.
స్పాట్ సెంటర్ పెళ్లి వారి విడిదిఇల్లు లా కళకళలాడుతుంది.
స్పాట్ సెంటర్లో తెలిసున్న ముఖా లు కనపడిన కూడా అపరిచితులై పోయారు.తెలుసున్న వాళ్ళని కళ్ళ తో సైగలే కానీ ఎవ్వరూ మాట్లాడుకోవడం లేదు.ఆలస్యం అయితే పేపర్ల స్కోర్ తగ్గి, రెమ్యూన్ రేషన్ తగ్గిపోతుందో ఏమోనని ఎవరి భయం వారికి ఉంది.
వామన రావు చేతిలో పరీక్ష పేపర్లు కొత్త కరెన్సీ నోట్ల లాగా పెలపెల లాడుతున్నాయి.
దేవుడికి మనసులోనే దండం పెట్టుకొని,పేపర్లను దిద్దడం మొదలుపెట్టాడు.
‘పిండి కొద్ది రొట్టె ‘అన్న చందంగా ఎవరూ ఎక్కువ దిద్దితే వాళ్ళకి రెమ్యూన్ రేషన్ కిట్టుబాటు అవుతుంది.
చాలామంది పేపర్లో ఏ మేటర్ రాశా రో పట్టించుకోవడం లేదు.జెట్ స్పీడ్ లో దూసుకుపోతున్నారు.
వామన రావుకు మొదటి రోజు కాస్త కష్టంగా అనిపించింది. రెండో రోజు విజ్రూంభించాడు .పక్క వాళ్ళని చూసి పోటి పడ్డాడు. పేపర్ల స్కోర్ ను పెంచుకున్నాడు.
ఇదంతా గమనిస్తున్న వామన రావు కొలీగ్ నిరంజన్రావు హితబోధ చేయబోయాడు.
“ ఊర్కోండి మాస్టారు. మీదంతా ఒట్టి చాదస్తం.దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టుకోవాలి. ఇంకా మనం చాలా నయం. కొంతమంది తమ సబ్జెక్టు కాక పోయినా పేపర్లు దిద్ది పడేస్తున్నారు”. అన్నాడు పేపర్లు దిద్దుతూనే నిరంజన్ రావు కి చెప్పాడు.
ఇలా చేస్తే విద్యార్థులు నష్టపోతారన్న నిరంజన్ రావు మాటలు చాలా తేలిగ్గా వామన రావు తీసిపారేసాడు.
వామన రావుకు తన తవ్వుకున్న గోతిలో తానే పడిపోయే ప్రమాదం ముందున్నది అన్న సంగతి పాపం గ్రహించలేకపోయాడు.
ఎప్పుడైనా స్పాట్ వ్యాలుయేషన్ డ్యూటీ పొరపాటున పడకపోయినా లంచం ఇచ్చి మరీ వేయించుకునే వాడు వామన రావు.
ఎప్పటిలాగే వామన రావు పేపర్లు దిదడుతున్నాడు. ఒక పేపరు చూసి



ఉలిక్కిపడ్డాడు.తెలిసిన హేండ్ రైటింగ్ లా ఉందే అనుకున్నాడు. కానీ డబ్బు పొరలు మైకం కప్పుకొని పోవటంతో కేర్ లెస్ గా ఆ పేపరును మిగతా పేపర్లు లా దిద్ది పడేసాడు. మనస్సాక్షి ని పీక నొక్కేశాడు. పేపర్లు దిద్ది ఇంటికి వచ్చాడు.
వామన రావు పుత్రరత్నం మంచి తెలివైనవాడు. ఎప్పుడూ తరగతి ఫస్ట్ వచ్చేవాడు.ఈసారి స్టేట్ ర్యాంకు గ్యారంటీ అనుకున్నాడు. కొన్ని రోజులకు రిజల్ట్స్ వచ్చాయి. వామన రావు కొడుకురిజల్ట్స్ చూసి షాక్ తిన్నాడు. ఆ షాక్ నుండి మెల్లగా డిప్రెషన్ లోకి వెళ్లిపోయాడు.
వామన రావుకి కాళ్లు చేతులు ఆడటం లేదు.
లేక లేక చాలా కాలంకి పుట్టిన పుత్రరత్నం బతుకు అలా అయి-ఎపోయినందుకు కుమిలి కుమిలి పోతున్నాడు. భార్యా పేపరులు దిద్దిన వాళ్లని ఒకటే శా పనార్థాలు పెడుతుంది.
విషయం తెలిసి అందరూ వచ్చి పరామర్శించి వెళ్తున్నారు.కొలీగ్స్ వచ్చి వెళ్లారు. నిరంజన్ రావు కూడా మిత్రుడ్ని ఓదార్చడానికి వచ్చాడు.వామన రావుకు ఒకేసారి
బరస్ట్ అయిపోయాడు.
“ఎన్ని చెప్పినా మీ మాట ఏనాడు నేను వినలేదు. నేను చేసిన పాపం నా బిడ్డ మీద పడింది మాస్టారు.” అంటూ గుడ్ల నీరు పెట్టుకున్నాడు. నిరంజన్ రావు ఓదార్చే ప్రయత్నం చేస్తున్నాడు.
“ఎందరో ఉసురు మా వాడి భవిష్యత్తును నాశనం చేసిందో?! ఇక జన్మలో పేపర్లు దిద్దను సార్” అంటూ కళ్ళు తుడుసుకున్నాడు. తన కొడుకు పేపరు తనే దిద్దుకున్నాడు అన్న సంగతి ఒక్క నిరంజన్ రావు కు మాత్రమే తెలుసు. పొరపాటున వామన రావు స్పాట్ సెంటర్ కి ఆ పేపరు కట్ట వచ్చింది. అసలు నిజం ఎప్పటికీ తను చెప్పడు గాక చెప్పడు.కొంచెం విచారం,కొంత ఆనందంతో మారిన వామన రావుని తలచుకుంటూ నిరంజన్ రావు ఇంటిదారి పట్టాడు.

**డాక్టర్. గాదిరాజు రంగరాజు**

# కుంభకోణం



“శంకరం దసరా సెలవుల్లో కుంభకోణం వెళ్ళడానికి టిక్కెట్లు బుక్ చేయించు” అంది తల్లి లక్ష్మీ నరసమ్మ.
“సరే” అన్నాడు శంకరం.
“మామ్మా కుంభకోణం లో ఏముంది చూడ్డానికి?” అని అడిగింది మనవరాలు మానస.
“దక్షిణ భారత దేశంలో అత్యంత ప్రాచీనమైన పుణ్యక్షేత్రాల్లో కుంభకోణం ఒకటి. చిదంబరానికి డెబ్బై కిలోమీటర్ల దూరంలో కావేరీ నది ఒడ్డున ఉంది. దీనికి దేవాలయాల నగరం అని పేరు. ఇక్కడ పదహారు దేవాలయాలు ఉన్నాయి. అందులో బ్రహ్మ దేవాలయం ఒకటి.
బ్రహ్మచే సృష్టించబడిన అమృత భాండం ప్రళయం లో కొట్టుకుపోతూ, పరమశివుని ఆజ్ఞతో ఇక్కడ వెలసిందని, అమృతం తో నిండిన ఆ కడవ కోణం ఆకారంలో ఉన్న పట్టణానికి చేరడం వలన కుంభకోణం అనే పేరు వచ్చిందని భక్తుల విశ్వాసం.” అని చెప్తూ వుండగానే “ఇటీవలే వెలుగులోకి వచ్చిన భూ కుంభకోణం” అన్న మాటలు రేడియోలో వినపడ్డాయి.
“మామ్మా భూ కుంభకోణం కూడా చూసొద్దమ్మా!” అని ఉత్సాహంగా అడిగింది మనవరాలు.
“నీ తెలివి తెల్లారినట్లే ఉంది. అది చూసే ప్రదేశం కాదు. దానిని ఆంగ్లంలో స్కాం అంటారు. ఒకప్పుడు కుంభకోణంలో దొంగ రైలు టికెట్లను ముద్రించేవారుట. ఇవి అసలు టికెట్లకు ఏమీ తీసిపోకుండా వుండేవిట. ఈ వ్యవహారం పై ప్రభుత్వం నిఘా పెట్టి శోధించింది. మూలం కుంభకోణం అని నిర్ధారించుకుని. ఆ ప్రింటింగ్ ప్రెస్ లను మూయించి దోషులను అరెస్టు చేశారు.
అలాగే కుంభకోణ ప్రాంత చెట్టియార్లు చిట్ ఫండ్ వ్యాపారాల ద్వారా రెట్టింపు మొత్తం ఆశచూపి ఆర్థిక మోసపూరిత వ్యాపారం చేసి అనేకమంది చేత డబ్బును పెట్టుబడి పెట్టించి కొంతకాలానికి ఆడబ్బుతో మాయమయ్యేవారు. మలయాళ భాషలో కుంభకోణం అంటే మోసం అను అర్థానికి ముడిపెట్టబడినది. అలా ఒకప్పుడు ఈ ప్రాంతం మోసాలకి నిలయమయ్యింది.
అప్పట్లో తరచూ కుంభకోణంలో నేరాల వార్తలు రావడంతో ఆ పేరు వెలుగులోకి వచ్చింది. ఏ పెద్ద నేరం లేదా అవినీతి జరిగినా కుంభకోణం అనడం ఆనవాయితీగా మారింది.” అని వివరించాడు తండ్రి శంకరం.
“అబ్బా ‘కుంభకోణం’ అనే ఈ జాతీయం వెనుక ఇంత కథ ఉందా” అని నోరెళ్లబెట్టింది మానస.

**కాశీ విశ్వనాథం పట్రాయుడు(బాల మిత్ర)**
**9494524445**

# కోరిన కోర్కెలు తీర్చే కోటదుర్గమ్మ



**ఒకనాడు జమీందారుల కోటలో ఉండి జమిందరులకు మాత్రమే దేవతగా ఉండేది.స్వాతంత్ర్యం తరువాత ఒక కుటుంబం ఆరాధనతో బైట పడినా అమ్మవారు గ్రామ దేవత అయింది. 2000 సంహత్సారం వరకు పాలకొండ గ్రామ దేవతగా,పాలకొండ వాసులతో సంబంధం ఉన్న వారికి దైవంగా ఉండేది.2001 తర్వాత సంహత్సర,సంహత్సరమ్ అభివృద్ధి చెందుతూ ఉత్తరాంధ్రల దేవతగా ,దేశ విదేశాలలో ఉన్నవారు ఆరాధ్య దేవత అభివృద్ధి చెందింది. దిన దిన అభివృద్ధికి కారణం భక్తుల కోరికలు తీరతమే అనేది నగ్న సత్యం.నాడు ఒక జమీందార్లకు మాత్రమే దేవత ,నేడు రాష్ట్ర పండగా ప్రకటించాలనే డిమాండ్ వరకు పెరిగింది.**

పాలకొండ నిన్నటి శ్రీకాకుళం జిల్లాలో నేడు మన్యెం జిల్లాలో మారుమూల గిరిజన ప్రాంతం. చుట్టుపక్కల ప్రాంతాలలో ప్రకృతిలో గిరిజనులు ఆవాసం ఉండే ఈ ప్రాంతం చుట్టూ సంరక్షణలా తెల్ల కొండలుండటంతొ . పాలకొండ ప్రత్యేకం గా ఉంటుంది. ఇక్కడి దుర్గా దేవత ఆలయం చారిత్రికంగా హిందూఆరాధన ఆలయంగా ప్రసిద్ధి చెందింది. నిత్యపూజ లతో పాటు దసరా నవరాత్రులలో తొమ్మిది రోజులపాటు అత్యంత వైభవంగా మతాలకు,కులాలకు దూరంగా ప్రతి సంవత్సరం వేడుకలజరుపుకోవటం విశేషం.

**స్వాతంత్రానికి ముందు ...**

ఈ ప్రాంతం బ్రిటిష్ పాలనలో జాతాపు తెగకు చెందిన జమీందార్ కుటుంబం ఈ ప్రాంతాన్ని పాలించినప్పుడు నాటి కోటలో పూజలందుకున్నదుర్గమ్మ నేడు జనవాహిని ముంగిటకోటదుర్గమ్మగా ప్రజలకు ఆశీస్సులందిస్తోంది. ఇది శ్రీకాకుళం జిల్లాలోనే ప్రాచీనమైనకొండ జమీందారీ సంస్థానం పాలకొండ. నాటి విజయ నగర రాజులకు లోబడియుండి యుద్ధ సమయములలో సేనలతో తోడ్పడు అందించడమే కాకుండా సాలీనా రూ62 వేలు కప్పము చెల్లించిన సంస్థానంగా పేరుంది. ఈ సంస్థానంలో 108 జిరాయితీ గ్రామాలు, 68 మొఖాసాగ్రామాలు, 49 అగ్రహారాలు ఉండటం గమనార్హం. పట్టుమని పదియేండ్లు ఏ పాలకుడు దీనినిపాలించలేదని చరిత్ర చెపుతున్న సత్యం.

**మరిన్నివివరాలలోకి వెళితే...**

కోదులేక జాతాపు అనే కొండలో నివాసముండేతెగలకు చెందిన విశ్వంభర దేవు ఒడిస్సాప్రాంతంలోని జయపురము రాజాగా పాలకొండ జమిందారీకి మూలపురుషుడు. తన కుమారుడు ధనుర్విద్యలో ఏకలవ్యునికి ప్రతీకలా నిలచే నరేంద్రనాయుడును తన పరిధిలోని పాలకొండ, వీరఘట్టములకు జమీందారుగా పట్టాభిషెక్తుని చేసారు. ఆపై తనపై తిరుగుబాటు వస్తుందన్న ఆంతరంగిక సమాచారంతో దానిని ధీటుగా ఎదుర్కొనేందుకు విజయనగర%వా% పూసపాటివారి ఆశ్రయించినట్టు చెపుతారు. నరేంద్రనాయుడు తదుపరి 1794లో పాలకొండ జమీందారుగా బాధ్యత చేపట్టిన విజయరామరాజుకు ప్రభుత్వముపై మూడేండ్లపాటు పితూరీ తిరుగుబాటు జరగటంతో అధికారమ-ునుండి ఆయనను తప్పించి 1798 లోఆయన కుమారుడగు సీతారామరాజుని సంస్థానముఅధినేత గా ప్రకటించారు...

(మిగతా 8వ పేజీలో)



( 7వ పేజీ తరువాయి)

## తొమ్మిదేళ్ల వయసున్నజమిందార్

సీతారామరాజు1798 లో కాలము చేయటంతో ఆయనసోదరుడైన కేవలం తొమ్మిదేళ్ల వయసున్న వెంకటపతిరాజుకిజమీందారీ వారసత్వంగా సంక్రమించి0ది. ఈ క్రమంలో పదవీ భ్రష్టుడైన విజయరామరాజు కొంతసేనను తయారు చేసుకుని, వీరఘట్టం కేంద్రముగా తన తిరుగుబాటుకు శ్రీకారం చుట్టారు. ఆతనిఅరాజక చర్యలను కనిపెట్టిన కుంఫిణీసేనలు విజయరామరాజు తప్పించుకొని మన్యంలలో సంచరింస్తూ నాగపురము పారిపోయాడు. 1755 లో రూ .5.5,000 / - ఫ్రెంచ్ భుత్వానికి రాబడిగా చెల్లించే అప్పటిలో ఈ ప్రాంతాన్ని వశంచేసుకున్న ఫ్రెంచీయులు చిన్న వయసులోనే రాజా వెంకటాపతి రాజు కు జమిందారీబాధ్యతలు అప్పగించారు.

## విలాసవంతుడై....

వెంకటపతిరాజు కు పరిపాలనలో దివానుగా ఎల్లుమహంతి రామపాత్రుడు అండతో ఉన్నప్పటికీ విషయలోలుడు, విలాసవంతమైన జీవనానికి, దూబరా మనిషిగా మారిన వెంకటపతిరాజు విజయనగర రాజులకు చెల్లించాల్లించాల్సిన పైకాన్ని సక్రమముగాచెల్లింపక పోవటంతో తరచూ జమీందారీ జప్తు చేసేందుకు విజయనగర ప్రభువూలు ఆగ్రహించడం, ఆపై వచ్చుటయు,దివానుగా ఉన్న రామపాత్రుడు ఏదో చేసి చెల్లింపులుచేయటంతో జామీను తిరిగివిడుదల చేయటం జరిగేది. ఈ క్రమంలోనే రాజునకు, దివానునకు కలతలు రేగిన నేపథ్యంలో రామపాత్రుడివారసుడుగా దివాను గా బాధ్యతులు చేపట్టినజగన్నాయక పాత్రుని, దివానుసోదరుని రాజా మొఖాసాదారుడుఅయిన వెంకటరాయడు, అతనిమేనల్లుడు పాపారాయడు సాయుధ సేనతో వచ్చి 1828లో హత్యగావించిట్టు చరిత్రచెపుతోంది. దీంతో విలాసవంతమైన జీవనానికి అలవాటు పట్ట వెంకటిపతిరాజుకు పాలనపై పట్టుతప్పిపోయినది.

## తిరుగుబాటులు, దోపిడులు

జమిందారుకు పాలన పట్టుతప్పడంతో తిరుగుబాటులు, దోపిడులు విచ్చలవిడిగా జరిగేవీ. " దీంతో సంస్థానము కల్లోలమవుతున్న దశలో 1828 అక్టోబరునెలలో వెంకటపతిరాజు ఆకస్మికంగా మ-రణించడంతో వారసత్వంపై కుటుంబంలో కలహాలు పెరిగాయి. ఈక్రమంలో బొబ్బిలి రాజులు ఈ ప్రాంతాన్ని వశంచేసుకున్నారు.

## అష్టభార్యలతో...

వాస్తవానికి వెంకటపతిరాజునకు ఎనిమిదిమందిభార్యలు. కూర్మరాజునరేంద్రరావు, విజయరామరాజు నరేంద్రరావు,నీలాద్రిరాజు సరేంద్రరావు అని ముగ్గురు కుమారులు,ముగ్గురు కుమార్తెలు ఉండేవారు. ఈభార్యలలో తాళ కట్టినవారు తక్కువని అంటారు. పెద్దలక్ష్మీనరసమ్మ మాత్రము ఈతని తాళికట్టిన





భార్య,పెద్దజగ్గమ్మ ఒక వేశ్య. సీతమ్మ,చామలమ్మ, చిన్నజగ్గమ్మ, సుందరమ్మలు తో రైతుబిడ్డ అయిన వెంకటలక్ష్మమ్మ, విశ్వ బ్రాహ్మణకులానికి చెందిన సుభద్రమ్మ మరో భార్య. ఇంతమందిని వెంకటపతిరాజు చేసుకోవటానికి ప్రధాన కారణం పట్టమహిషి నరసమ్మకి సంతతి లేక పోవటమే. ఇకపెద్దకుమారుడైన కూర్మరాజు వారకాంత యగు పెద్దజగ్గమ్మ కుమారుడు,రెండవ కుమారుడైన విజయరామరాజు చిన్న జగ్గమ్మ కుమారుడు. మూడవ కుమారుడైన నీలాద్రిరాజువెంకటలక్ష్మమ్మ కు పుట్టినవాడు. వెంకటపతిరాజు మరణముతో సంస్థానాధిపత్యమునకు వీరి ముగ్గురు మధ్యతగాదాలు రావటంతో నాటి విజయనగర పాలకులతో కుంఫిణీ లు చర్చలు జరిపి 1828 లో పెద్దకుమారుడగు కూర్మరాజునే వారసునిగా గుర్తించి, చామలమ్మను ఎస్టేటు మేనేజరుగా నియమించి పరిపాలో పాలన ను కోర్డ్ ఆఫ్ వార్డ్స్ సారథ్యంలోసాగాలని నిర్ణయించారు. అయితే కూర్మరాజు మైనరు కావటం, మేనేజరుగా నియమించబడ్డ చామలమ్మతో సరిపడ క పోవటం, దీనికితోడు తక్కిన తల్లుల నుంచి కూర్మరాజుకు మద్దతు కరువు కావటం, వీరి మధ్య ఆస్తులకోసం ఎప్పటికప్పుడు జగడాలు జరగటంతో ఎవరికివారేయమునాతీరే బాపతు గా మారి పోయింది. వీరికివిడివిడిగా మొఖాసాదారులయు, ముఠాదారులయు మద్దత్తు ఉండటంతో ఇబ్బందులు పడాల్సి వచ్చింది. ఆపిమ్మట పద్మనాభాచార్యులను వ్యక్తిని కూర్మరాజుకు గార్డియన్ గా నాటి బొబ్బిలి రాజులు నియమించినప్పటికీ అంతఃకలహములు పరకాష్ఠకు చేరటం, జమీందారీ యంతట అల్లరులు, అరాజకచర్యలు పెరిగి పోయాయి. ఈ క్రమంలో 1831 లోకూర్మరాజుకు మైనార్టీ తీరి తనని తాను పూర్తి స్థాయి జమిందారుగా ప్రకటించుకున్నప్పటికీ 33 వేల పైకము బకాయిపడినట్టు తెలుస్తోంది.

## బొబ్బిలి యుద్ధం తదుపరి..

విజయనగర రాజుల ద్వారా. విజయనగరం మరియు బొబ్బిలి సమస్తంగాల మధ్య "విజయనగర రాజుల మద్దతుతో" ఫ్రెంచ్ ప్రభుత్వానికి చెందిన బుస్సీకి వ్యతిరేకంగా జరిగిన యుద్ధము తరువాత అంతర్గత కుటుంబ సంఘర్షణలు ఓవైపు బ్రిటీష్ పాలకుల పరిధిలోకి పాలకొండ సంస్థ దాడి కి రావటం, వారికి చెల్లించాల్సిన పేష్కషు బకాయిలు చెల్లించకపోవటం, మరోవైపు జమిందారీ పరిధిలో పితూరీలు పెచ్చుమీరటంతో 1837 లోకూర్మరాజును జమీందారీ నుండి తప్పించి సంస్థానమును 1840 వరకు కలెక్టరు అజమాయిషీలో ఉంచాలనినిర్ణయించింది. 1840 నుండి జమీందారీని హొంజరం తాలూకాతో పాటు లక్ష పదివేలకు ఆర్బత్నాట్ కంపెనీ కి అప్పగించింది

## మద్రాసు హైకోర్టులో అస్తుల దావా

కుంఫిణీ,జమిందారుల ఆస్దుల వ్యవహారాలు (20 సంవత్సరాల కన్నా ఎక్కువ కోర్టు కేసు మద్రాసు హైకోర్టులోజరిగింది) ఈ కారణంగా జమీందార్లు వారి ఆస్తులను సమస్తతం కోల్పోయారు. ఈ క్రమంలోనే పాలకొండ జమీందారు కుటుంబము నకు చెందిన ముఖ్యులైన 19 మంది రాయవేలూరు దుర్గమున నిర్బంధంలో ఉంచారు. ఈదశలో కూర్మ రాజుపై విచారణలు జరిపి మొదట మరణశిక్షను విధించాలని నిర్ణయించినా దానిని యావజ్జీవ కారాగార మార్చారు. అతనితల్లి పెద్దజగ్గమ్మ ను గుత్తి కోటలోను,విజయరామరాజు మొదలైన తక్కినవారిని రాయవేలూరు కోటలోను నివసించునట్లు ఏర్పాట్లుచేసారు. 1843 లోకూర్మరాజు గుత్తి కోటలో మరణించగా 1844 లోనీలాద్రిరాజు రాయవేలూరులో మరణించెను.

(మిగతా 9వ పేజీలో)

( 8వ పేజీ తరువాయి)

## నిర్భంధం ఎత్తివేత...

1869 లో మద్రాసు గవర్నరునే పియర్ ప్రభువు రాయవేలూరును దర్శించినపుడు పాలకొండ పాలక కుటుంబమును పరామర్శించి విజయరామరాజు పై నిర్భంధాన్ని ఎత్తివేసి కృష్ణానదికి దక్షిణమున ఎచ్చటనైనను తనకు నచ్చిన ప్రదేశంలోఉండవచ్చని ఉత్తర్వులు ఇచ్చారు. అయితే విజయరామరాజు చెన్నపట్టణము(నేటి చెన్నై)లో ఉండటానికి విన్నవించుకోవటంతో . అతనిసవతితల్లి సుభద్రమ్మ , సవతిచెల్లెలు చంద్రయ్యమ్మ కూడ అతనితో ఉండేందుకు మక్కువచూపారు. దీంతో. విజయరామరాజు నెల భరణము రూ.17న్నర నుండి రూ.250 లకు పెంచినట్టు తెలుస్తోంది.రాయవేలూరు కోటయందేఅంతరించిన పాలకొండ జమీందారీ కుటుంబము ఇరువదియవ శతాబ్దము వెలుగును చూడనే లేదన్నది వాస్తవం.

## కోటదుర్గమ్మగా

జమిందారీకుటుంబాల నడుమ ఎన్ని వైరుధ్యాలున్నా కోటలోని దుర్గమ్మ విషయంలలో మాత్రం ఎలాంటి పొరపాట్లు జరిగేవి కావని , ప్రతి ఒక్కరూ నియమనిష్ఠలతో కొలిచేవారన్నది చారిత్రిక కథనం. అప్పట్లో దసరావేడుకలు సైతం వైభవంగా జరిగేవంటారు.అయితే పాలకొండ జమిందారీ వ్యవస్థ పతనం తదుపరి వారసులుచెన్నైలో స్థిరపడిపోవటం కోట ఆలనా పాలనా కరువై పూర్తిగా శిధిలా వస్థకు చేరింది. కోట మృగ్యమైనా ఇప్పటికీఈ ప్రాంతంలో నాటి పాలకులకు ప్రతీకలుగా అప్పటి వారి పేర్లతో పెద్దపెద్ద చెరువులు దర్శనమిస్తాయి.

## పునర్ వైభవం

ఇక ప్రస్తుత కోటదుర్గమ్మ పునర్ వైభవం గురించి ఓ సారి ప్రస్తావించుకుంటే...1947 లోఒరిస్సా నుండి వ్యకిగతపనులపై కృష్ణావల్లభ దాస్ అనే దుర్గా దేవిభక్తుడు పూర్తిగా శిధిలమైపోయిన కోట ప్రాంగణంలో సేద తీరుతున్న సమయంలో తను కోట శిధిలాలనడుమ ఉన్నానని, తనని బైటకు తీసుకువఛి పూజలు చేయాలని ఆదేశాలు జారీ చేసింది. దీంతోఉలిక్కి పడి లేచిన కృష్ణా వల్లభ దాస్ దుర్గాదేవి తనకు ఇచ్చిన ఆదేశాలనుస్థానిక పెద్దలకు చెప్పడం, వారు సైతం అమ్మవారిని





వెలికి తీసేందుకు సిద్దమవటం జరిగింది. ఈ దశలోనే తుప్పలతో నిండి పోయిన ఆ ప్రాంతాన్ని పూర్తిగా పరిశుభ్రపరచి, కోట గోడకు ఉన్నఅమ్మవారును గుర్తించి, ఈ ప్రాంతంలో ప్రతిష్ఠించారు. పాలకొండ కోటలోంచి బైట పడిన అమ్మవారికి శ్రీకోటదుర్గమ్మ వారిగా పిలుస్తూ చుట్టుపక్కలప్రాంతాల ప్రజలు పసుపునీళ్లతో దీప ఘటలను తీసుకువచ్చిపూజలు ఆరంభించారు.

## కృష్ణా వల్లభ దాస్ వారసులు

శ్రీకోటదుర్గను బైటకు తెచ్చిన దుర్గాదేవి ఉపాసకులైన కృష్ణా వల్లభ దాస్ ను అక్కడే ఉండిసేవలలందించాలని గ్రామపెద్దలు, ప్రజలు కోరటంతో ఆయన తన కుటుంబాన్నిపాలకొండ తీసుకువచ్చి, ప్రజలలో మమేకమయ్యారు. కోటదుర్గమ్మకు అందరి సహకారంతో ఆలయాన్ని ఏర్పాటు చేయటంతో పాటు విజయవాడ దుర్గాదేవి ఆలయ పద్దతులు అనుసరిస్తూ పూజాదికాలు నిర్వహించేవారు. ఆయన మరణానంతరం ఆతనికుమారుడైన కృపాసింధు దాస్ ఆఅలయ అర్చకత్వ బాధ్యతలు స్వీకరించడంతో పాటు ముగ్గురు కుమారులు పూర్ణచంద్ర దాస్, శరత్ చంద్ర దాస్,వెంకటేశ్వర దాస్ 2001 వరకు ఆలయాన్నివిస్తరించి, దసరా ఉత్సవాలు అంగరంగవైభవంగా నిర్వహించి ఉత్తరాంధ్రలో కోటదుర్గమ్మ ఆలయానికి ఓ ప్రత్యేకత తీసుకువచ్చారనటంలో సందేహం లేదెవ్వరికీ. ఆలయానికి ఎలాంటి స్థిర, చరాస్తులు లేకున్నా, కృపాసింధుదాస్ అర్చకత్వం, అమ్మవారి మహిమలు ఆలయాన్ని దేదీప్యమానంగా వెలుగొందేందుకు కారణం అని చెప్పకతప్పదు.అనంతరపరిణామాలతో దేవాదాయ శాఖపరిధిలోకి వెళ్లిన ఈ ఆలయ ఆదాయంక్రమక్రమంగా పుంజుకుంది. ఈ ప్రాంతంలో దేవాదాయశాకపరిధిలోని అనేక ఆలయాలకు వందలఎకరాల భూములు ఉన్నా, అక్కడి అర్చకులకు, సిబ్బంది జీతాలకు ఇదే ఆధారం కావటంవిశేషం.

## రాష్ట్ర పండగ గా గుర్తించాలని డిమాండ్

ఆంధ్రప్రదేస్ రాష్ట్ర ప్రభుత్వం వారి సంభావ్యతతో నడుస్తున్న ఈ ఆలయం పాలకొండ పట్టణం మరియు దాని చుట్టూ ఉన్నమండలాలకు గొప్ప సాంస్కృతిక ప్రాధాన్యత గా నిలుస్తోందనే చెప్పాలి..ప్రతి సంవత్సరం, దసరా నవరాత్రులు గొప్పఉత్సాహంతో వేనోళ్లప్రశంసలతో కొనసాగుతున్నాయి. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర పండగా గా ప్రకటించాలని డిమాండ్ వరకు పెరిగింది...

ప్రిన్స్ టాలెంట్ ఉన్న ఆర్టిస్ట్. హీరోగా ఇండస్ట్రీలోకి వచ్చారు. తర్వాత యంగ్ హీరోల సినిమాల్లో కీ రోల్స్ చేశారు. కొంత విరామం తర్వాత ఆయన హీరోగా నటించిన సినిమా 'కలి'. కె. రాఘవేంద్ర రెడ్డి సమర్పణ, శివ శేషు దర్శకత్వంలో లీలా గౌతమ్ వర్మ నిర్మించారు. ఇందులో నరేష్ అగస్త్య మరో హీరో. ప్రిన్స్ భార్య పాత్రలో నేహా కృష్ణన్ నటించారు. ఈ సినిమా ఎలా ఉందంటే?

**కథ :** శివరామ్ (ప్రిన్స్) మంచోడు. ఎవరైనా ఏదైనా అడిగితే సాయం చేయడం తప్ప తిరిగి తీసుకోవడం తెలియదు. శివరామ్ మంచితనాన్ని అలుసు చేసుకుని అతడిని చాలా మంది మోసం చేస్తారు. అతనిలోని ఏ లక్షణం అయితే నచ్చి ప్రేమించి పెళ్లి చేసుకుందో... చివరకు ఆ లక్షణం నచ్చడం లేదని అతణ్ణి వదిలేసి వెళ్లిపోతుంది వేద (నేహా కృష్ణన్). సమాజంలో మనుషుల మధ్య బ్రతకలేనని ఆత్మహత్య చేసుకోవడానికి శివరామ్ రెడీ అవుతాడు. ఉరి వేసుకునే సమయంలో డోర్ కొట్టడంతో వెళ్లి తీస్తాడు. చూస్తే అతని ఎదురుగా ఓ వ్యక్తి (నరేష్ అగస్త్య) ఉంటాడు. భారీ వర్షంలోనూ తడవకుండా వచ్చిన అతడిని చూసి ఆశ్చర్యపోతాడు. ఎందుకు ఆత్మహత్య చేసుకుంటున్నావని అడిగి విసిగిస్తాడు. కోపంతో వచ్చిన వ్యక్తిని బయటకు గెంటేస్తాడు శివరామ్. తాగిన మత్తులో కింద పడతాడు.

మత్తు దిగిన తర్వాత చూస్తే శివరామ్ మరణిస్తాడు. అప్పుడు తన దగ్గరకు వచ్చినది కలి యుగాన్ని పాలించే కలి అని తెలుస్తుంది. మళ్లీ వచ్చిన కలి, బతుకు మీద శివరామ్ మనసులో ఆశలు కల్పిస్తాడు. ఆ తర్వాత ఏమైంది? శివరామ్ మళ్లీ బ్రతికాడా? లేదా? శివరామ్, కలి మధ్య ఏం జరిగింది? శివరామ్ ఆశలతో కలి ఏ విధంగా ఆట ఆడుకున్నాడు? అనేది సినిమా చూసి తెలుసుకోవాలి.

**విశ్లేషణ :** మైథాలజీ నేపథ్యంలో ఇటీవల ఎక్కువ సినిమాలు వస్తున్నాయి. అయితే... 'కలి' యూనిక్ పాయింట్‌తో తెరకెక్కింది. ఆత్మహత్యకు పాల్పడటం నేరం. ఆత్మహత్య చేసుకోవడం వల్ల కుటుంబంలోని ఇతరుల జీవితాలు, ముఖ్యంగా కట్టుకున్న భార్య, పిల్లల బతుకులు ఏ విధంగా తల్లకిందులు అవుతాయనేది దర్శకుడు శివ శేషు చక్కగా చూపించారు. అయితే... ఆ సందేశానికి మైథాలజీ టచ్ ఇవ్వడంతో సన్నివేశాలు కొత్తగా ఉన్నాయి. ప్రజెంట్ సొసైటీలో మంచోడిగా బ్రతకడం కష్టం. అసలు ఎటువంటి కల్మషం లేని మంచోడు కనిపిస్తే 'ఏ మ్యూజియం నుంచి వచ్చావ్రా' అనుకునే రోజులు. ఇటువంటి సమాజంలో మంచోడు ఎన్ని కష్టాలు పడతాడనేది చూపించడంతో పాటు మనిషి ఆత్మహత్య చేసుకోకూడదని చెప్పాడు శివ శేషు. అతని ఆలోచన బావుంది. కానీ, ఆచరణలో కొంత తడబాటు కనిపించింది. ముఖ్యంగా విశ్రాంతి వరకు కథను నడిపే విధానంలో యూనిక్ పాయింట్ పక్కన పెట్టి రొటీన్ సన్నివేశాల వైపు వెళ్లారు. ప్రిన్స్ ప్రేమలో పడిన నేహా కృష్ణన్ ఇంటి నుంచి వచ్చేయడం గానీ, ఆ తర్వాత వచ్చే పాటలో గానీ ఎటువంటి కొత్తదనం లేదు. ఆ సన్నివేశాలు బాగా రాసుకుంటే బోర్ కొట్టకుండా ఉండేది. అయితే... ప్రిన్స్, నరేష్ అగస్త్య మధ్య సన్నివేశాల్లో శివ శేషు టాలెంట్ చూపించారు.



'కలి' సినిమాకు ఆన్ స్క్రీన్ హీరోలు ప్రిన్స్ %ం% నరేష్ అగస్త్య అయితే... ఆఫ్ స్క్రీన్ మెయిన్ హీరో సంగీత దర్శకుడు జేబీ. ఒక సాధారణ సన్నివేశాన్ని కూడా తన నేపథ్య సంగీతంలో నెక్స్ట్ లెవల్‌కు తీసుకు వెళ్లాడు. ఇక... 'కలి'గా నరేష్ అగస్త్య ఎంట్రీ ఇచ్చే సన్నివేశంలో రీ రికార్డింగ్ ఇంకా బావుంది. ఆ ఒక్క సన్నివేశంతో మళ్లీ సినిమాకు హై ఇచ్చారు. కెమెరా వర్క్ ఓకే. బడ్జెట్ పరిమితులు స్క్రీన్ మీద కనిపించాయి.

నరేష్ అగస్త్య స్క్రీన్ ప్రజెన్స్, అతని నటన 'కలి'కి మెయిన్ అసెట్. ఇంట్లో బోర్న్ ఫైర్ దగ్గర సన్నివేశంలో క్లోజప్ షాట్ ఉంటుంది. నటుడిగా కమాండ్ చూపించారు. ప్రతి సన్నివేశం కన్విక్షన్‌తో చేశారు. నరేష్ అగస్త్య స్క్రీన్ మీద కనిపించిన ప్రతి సీన్ ఆడియన్స్‌ను ఎంగేజ్ చేసేలా ఉంది. శివరామ్ పాత్రలో ప్రిన్స్ డీసెంట్ పెర్ఫార్మన్స్ ఇచ్చారు. అటువంటి క్యారెక్టర్ ఎక్కువ స్కోప్ ఇవ్వదు. కానీ, ఛాన్స్ దొరికినప్పుడు యూజ్ చేసుకున్నాడు. నేహా కృష్ణన్ ఓకే. మిగతా ఆర్టిస్టుల కంటే బల్లికి వాయిస్ ఓవర్ ఇచ్చిన ప్రియదర్శి, బొద్దింకకు వాయిస్ ఓవర్ ఇచ్చిన మహేష్ విట్టా కొన్ని సన్నివేశాల్లో నవ్వించారు.

మెసేజ్ ఓరియెంటెడ్ మైథలాజికల్ థ్రిల్లర్ 'కలి'. స్టార్టింగ్ బావుంటుంది. బాడీని ఆత్మ పాతి పెట్టడానికి వెళ్లడం, కలియుగం గురించి చెప్పడం క్యూరియాసిటీ క్రియేట్ చేస్తాయి. అయితే... ప్రిన్స్, నేహా కృష్ణన్ మధ్య రొటీన్ లవ్ ట్రాక్, మ్యారేజ్ లైఫ్ సీన్స్ బోర్ కొట్టినా... మళ్లీ ఇంటర్వెల్ ముందు రైట్ ట్రాక్ ఎక్కేస్తుంది. 'బ్రో' కాన్సెప్ట్ గుర్తుకు వచ్చినా... ఎండింగ్ వరకు చూసేలా చేసిన క్రెడిట్ నరేష్ అగస్త్య, ప్రిన్స్, సంగీత దర్శకుడు జేబీకి వెళుతుంది. రేటింగ్: 2.5/5

---




'రాజ రాజ చోర'తో శ్రీ విష్ణు భారీ విజయం అందుకున్నారు. ఆ సినిమా దర్శకుడు హసిత్ గోలితో ఆయన చేసిన తాజా సినిమా 'శ్వాగ్'. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకం మీద టీజీ విశ్వప్రసాద్ నిర్మించారు. ఇందులో శ్రీవిష్ణు నాలుగు రోల్స్ చేశారు. రీతూ వర్మ కథానాయికగా... మీరా జాస్మిన్, దక్షా నగార్కర్ ప్రధాన పాత్రలు పోషించారు. ఈ సినిమా 'సామజవరగమన', 'ఓం భీం బుష్' తర్వాత శ్రీ విష్ణుకు హ్యాట్రిక్ ఇచ్చిందా? లేదా? ఎలా ఉందో చూదండి.

**కథ :** భవభూతి (శ్రీవిష్ణు) ఎస్సైగా రిటైర్ అవుతాడు. అయితే, అతనికి రావాల్సిన పెన్షన్, ప్రావిడెంట్ ఫండ్ రాకుండా ధనలక్ష్మి అనే ఓ మహిళా అధికారి అడ్డుకుంటుంది. డబ్బులు రాలేదని బాధ పడుతున్న సమయంలో తాను శ్వాగణిక వంశంలో జన్మించిన వ్యక్తి అని, వారసత్వంగా తనకు కోట్ల రూపాయల ఆస్తి వచ్చే అవకాశం ఉందని తెలుస్తుంది. ఆస్తి కోసం వంశవృక్ష నిలయానికి వెళతాడు భవభూతి. అతనికి అక్కడ అనుభూతి (రీతూ వర్మ) కనిపిస్తుంది. శ్వాగణిక వంశ వారసులు తమ వారసత్వాన్ని నిరూపించుకోవడానికి అవసరమైన రాగి పలక ఆమె దగ్గర ఉంటుంది.

శ్వాగణిక వంశ పారంపర్య పలక అనుభూతి దగ్గరకి ఎలా వచ్చింది? సింగరేణి అలియాస్ సింగ (శ్రీవిష్ణు) ఎవరు? ఒకే రూపురేఖలతో ఉన్న భవభూతి, సింగ మధ్య సంబంధం ఏమిటి? వాళ్లిద్దరికి ఆస్తి రాకుండా చేసిన యయాతి (శ్రీ విష్ణు) ఎవరు? అతను ఏం చేశాడు? 1551 ఏళ్ల క్రితం మగాళ్లని తన కాలి కింద చెప్పుల కింద చూసిన వింజామర వంశ మహారాణి రుక్మిణీ దేవి (రీతూ వర్మ)ని మాయ చేసి పురుషాధిక్యం పెంచడానికి శ్వాగణిక వంశ మహారాజు భవభూతి (శ్రీ విష్ణు) ఏం చేశాడు? రేవతి (మీరా జాస్మిన్), విభూతి ఎవరు? చివరకు ఆస్తి ఎవరికి దక్కింది? అనేది మిగతా సినిమా.

**విశ్లేషణ :** పురుషాధిక్యత – స్త్రీ సాధికారత, మాతృస్వామ్యం – పితృస్వామ్యం... సమాజంలో వీటి గురించి చర్చ జరుగుతుంది. వీటితో సంబంధం లేకుండా, 'లింగ వివక్ష లేకుండా అందరినీ సమానత్వంతో చూడటమే మానవత్వం' అని సందేశం ఇచ్చే సినిమా 'శ్వాగ్'. అంతకు మించి ఎక్కువ చెబితే అసలు ట్విస్ట్ రివీల్ అవుతుంది.

హసిత్ గోలిలో తెలుగు మీద మంచి పట్టు ఉంది. సంభాషణల్లో అది కనిపించింది. మాటల రచయితగా ప్రతిభ చూపించిన సన్నివేశాలు ఎన్నో ఉన్నాయి. ఆయనకు మేకింగ్ మీద గ్రిప్ ఉంది. సన్నివేశాలు తీసిన విధానంలో, సంగీత దర్శకుడి నుంచి పాటలు తీసుకోవడంలో, ఆర్టిస్టుల చేత పెర్ఫార్మన్స్ చేయించడంలో దర్శకుడిగా హసిత్ గోలి మెరిసిన సన్నివేశాలు ఉన్నాయి. అయితే, కథకుడిగా ఫెయిలయ్యారు. ప్రతి ఒక్కరికీ అర్థమయ్యేలా చెప్పాల్సిన కథను స్క్రీన్ ప్లేతో కంగాళీ చేశారు. ఈ కథను ట్విస్టులతో... ఒక్కొక్కరి ఫ్లాష్ బ్యాక్ రివీల్ చేస్తూ... స్క్రీన్ ప్లేతో మేజిక్ చేయాలని ట్రై చేశారు. కానీ, అది వర్కవుట్ కాలేదు. ఇటీవల రాజా రవీంద్ర ప్రధాన పాత్రలో నటించిన ఓ చిన్న సినిమాలో ఇటువంటి సందేశాన్ని ఇచ్చారు.

'శ్వాగ్' ప్రారంభం బావుంది. సినిమా ఆసక్తికరంగా మొదలైంది. ఇంటర్వెల్ వరకు కథ ఏమిటి? అనేది అర్థం కాదు. అసలు కథ అంతా ఇంటర్వెల్ తర్వాతే ఉంది. ఆ మాటకు వస్తే... ఇంటర్వెల్ తర్వాతే నటుడిగా శ్రీవిష్ణు గానీ, దర్శక రచయితగా హసిత్ గోలి గానీ అద్భుతమైన పనితీరు చూపించినది. వివేక్ సాగర్ స్వరాలు, నేపథ్య సంగీతం బావున్నాయి. రెట్రో సాంగ్ ట్యూన్ చేయడంలో ఆయన టాలెంట్ కనబడుతుంది. కెమెరా వర్క్, ప్రొడక్షన్ డిజైన్ కృషి వల్ల స్క్రీన్ మీద డిఫరెంట్ టైమ్ లైన్స్ చూపించినప్పుడు వేరియేషన్ బాగా కనిపించింది. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ ప్రొడక్షన్ వేల్యూస్ పరంగా రాజీ పడలేదు. ఈ కథపై అంత ఖర్చు చేయడం గ్రేట్.

యంగ్ హీరోల్లో పెర్ఫార్మన్స్ పరంగా ఎటువంటి రోల్ అయినా చేయగలడని శ్రీవిష్ణు ఆల్రెడీ ప్రూవ్ చేసుకున్నారు. ఆయన కామెడీ చేయగలరు, ఎమోషన్స్ కూడా అంతే అద్భుతంగా పండించగలరు. అయితే... 'శ్వాగ్' ప్రేక్షకుల్లో ఆయనపై ఇంకా గౌరవం పెంచుతుంది. అందుకు కారణం విభూతి రోల్. ఇందులో శ్రీవిష్ణు ఐదు రోల్స్, ఏడు లుక్కుల్లో కనిపిస్తారు. అయితే విభూతి మాత్రం ప్రత్యేకం. అంతకు మించి ఎక్కువ చెప్పలేం. చెబితే ట్విస్ట్ రివీల్ అవుతుంది. విభూతి మినహా మిగతా పాత్రలు చేయడం శ్రీవిష్ణుకు కొత్త కాదు. కానీ, ఎస్సై భవభూతి పాత్రకు చెప్పిన డబ్బింగ్, ఆ గెటప్ సరిగా కుదరలేదు. ఇరిటేట్ చేసింది. ఆ విషయంలో దర్శకుడు జాగ్రత్తలు తీసుకోవాల్సింది.

పెర్ఫార్మన్స్ ఓరియెంటెడ్ రోల్స్‌కు తానొక మంచి ఆప్షన్ అని 'శ్వాగ్'తో దర్శక రచయితలకు మీరా జాస్మిన్ సంకేతాలు పంపించారు. ఆవిడ స్క్రీన్ ప్రజెన్స్, నటన బావున్నాయి. ఆ పాత్రకు హుందాతనం తెచ్చాయి. రెండు పాత్రల్లో రీతూ వర్మ చక్కగా నటించారు. శ్రీవిష్ణుతో రొమాంటిక్ సీన్స్, కీలకమైన సన్నివేశాల్లో దక్షా నాగర్కర్ కనిపించారు. ఈ సినిమాకు ఆవిడ గ్లామర్ డాల్ అని చెప్పవచ్చు. చాలా రోజుల తర్వాత రవిబాబుకు ఫుల్ లెంగ్త్ రోల్ లభించింది. గోపరాజు రమణతో ఆయన సన్నివేశాలు, శ్రీవిష్ణు – గెటప్ శ్రీను మధ్య సన్నివేశాలు కొన్ని నవ్వించాయి.

స్వాగ్... మంచి సందేశాత్మక చిత్రమిది. ప్రస్తుత సమాజానికి అవసరమైన అంశాన్ని చాలా సున్నితంగా, చక్కగా చెప్పారు. ఆ సందేశాన్ని వినోదంతో చెప్పాలని చేసిన ప్రయత్నం అభినందనీయం. కానీ, ప్రేక్షకుడిని కన్ఫ్యూజ్ చేసే స్క్రీన్ ప్లే... ఓవర్ ది బోర్డు క్యారెక్టర్స్ ఆ సందేశాన్ని, వినోదాన్ని డౌన్ చేశాయి. అయితే... ఆ సందేశం కోసం, శ్రీవిష్ణు కొత్త అవతార్ కోసం ఒకసారి థియేటర్లకు వెళ్లవచ్చు.

# ప్రియాంక మోహన్

